Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

APTEL:2024/86143 జాతీయ తెలుగు దినపత్రిక




Editor : Dama Vijaya Kumar | Volume : 2 | issue: 42 | Price : 3/- | Pages : 4 | Thirupati - Chittoor

అసోషియేట్ ఎడిటర్ : కే ఎల్ కృష్ణం రాజు | సంపుటి : 2 | సంచిక :42 | గురువారం 12 ఫిబ్రవరి 2026 | వెల : 3 | పేజీలు : 4



## భారతమాతను మోదీ సర్కార్ అమ్మేసింది

- హోల్‌సేల్‌గా అమెరికాకు సరెండర్
- లోక్‌సభలో రాహుల్ గాంధీ
- లోక్‌సభలో అమెరికా, భారత్ ట్రేడ్ డీల్‌పై రాహుల్ గాంధీ విమర్శలు
- ఒప్పందంలో అమెరికా ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇచ్చారని ఆరోపణలు
- కేంద్రం తీరుపై కాంగ్రెస్ అగ్రనేత ఘాటు వ్యాఖ్యలు




## భారీ ఉగ్ర కుట్ర భగ్నం

- పాక్ ప్రేరేపిత ఉగ్రవాది అరెస్ట్
- పంజాబ్, దిల్లీ సహా పలు రాష్ట్రాల్లో దాడులకు ప్లాన్
- ఐఈడీ, పిస్టల్, మందుగుండు సీజ్
- పాకిస్థాన్‌కు చెందిన ఓ ఉగ్రవాది సహకారంతో నిందితుడు భారత్‌లో ఉగ్రదాడులకు ప్రణాళిక రచించాడని దర్యాప్తులో గుర్తింపు

## 20 నెలల పాలన..

# 60 విజయాలు



- కూటమి నేతలకు జాబితా ఇచ్చిన సీఎం చంద్రబాబు
- ఎన్డీఏ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సీఎం చంద్రబాబు సమావేశం
- 20 నెల పాలనలో సాధించిన విజయాలను వివరించిన సీఎం
- విధ్వంసం నుంచి వికాసం వైపు పురోగతి సాధించామన్న చంద్రబాబు
- ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేలకు పిలుపు
- 60 ప్రధాన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల జాబితా విడుదల

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

ఏపీ శాసనసభ బడ్జెట్ సమావేశాల తొలిరోజున అసెంబ్లీ కమిటీ హాలులో ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమావేశమయ్యారు. గడిచిన 20 నెలల కూటమి ప్రభుత్వ పాలనలో సాధించిన విజయాలను, చేపట్టిన అభివృద్ధి-సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని ఆయన దిశానిర్దేశం చేశారు. రాష్ట్రం విధ్వంసం నుంచి వికాసం వైపు పురోగమిస్తోందని, ప్రతి రంగంలోనూ వృద్ధి నమోదైందని తెలిపారు. ప్రజావసరాలను గుర్తించి నిర్ణయాలు తీసుకుంటూ అతి తక్కువ కాలంలోనే ప్రజలు మెచ్చే పాలన అందించామని

- మిగతా3లో



## గ్రూప్-1లో అక్రమాలు నిగ్గు తేల్చేందుకు

# సిట్ ఏర్పాటు

- గ్రూప్-1 మూల్యాంకనంలో అక్రమాలపై హైకోర్టు కీలక ఉత్తర్వులు
- అక్రమాలు నిగ్గు తేల్చేందుకు సిట్ ఏర్పాటుకు ఆదేశం
- పత్రాలు తారుమారు చేశారా అనేదాన్ని ఫోరెన్సిక్ నిపుణులతో నిర్ధారించాలని వెల్లడి

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

గ్రూప్-1 ప్రధాన పరీక్షా పత్రాల మూల్యాంకనంలో అక్రమాలపై హైకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. జవాబుపత్రాల మూల్యాంకనంలో జరిగిన అక్రమాలను నిగ్గు తేల్చేందుకు సిట్ ఏర్పాటు చేయాలని న్యాయస్థానం ఆదేశించింది. అడిషనల్ డీజీ స్థాయి అధికారితో సిట్ ఏర్పాటు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. రాష్ట్రం వెలుపల ఉన్న ఫోరెన్సిక్ నిపుణుల సహాయం తీసుకోవాలని స్పష్టం చేసింది. మార్చి 16 లోపు నివేదిక సమర్పించాలని ఆదేశించింది. గ్రూప్-1 పరీక్షా పత్రాల

- మిగతా3లో

## 'వాయు శక్తి-2026'లో ఆపరేషన్ సిందూర్ విన్యాసాలు

ఆపరేషన్ సిందూర్‌లో రాఫెలే హీరో, మరిన్ని మల్టీ రోల్ యుద్ధ విమానాలు కొంటాం: వాయుసేన

ఎయిర్ మార్షల్ నగేష్ కపూర్ వెల్లడి



# ఏపీ ఏఐ లివింగ్ ల్యాబ్స్‌కి ఆమోదం


- సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం
- 24 అజెండా అంశాలకు ఆమోదం
- నీటిపారుదలశాఖలోని 7,189 నిర్వహణ పనులకు పరిపాలనా ఆమోదం



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

సీఎం చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో జరుగుతున్న మంత్రివర్గ సమావేశం పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. నీటిపారుదలశాఖలోని 7,189 నిర్వహణ పనులకు పరిపాలనా ఆమోదం తెలిపారు. భూములు బదిలీకి సంబంధించి చట్ట సవరణ ముసాయిదా బిల్లుకు క్యాబినెట్‌లో ఆమోదం లభించింది. గాజువాక రెవెన్యూ గ్రామ పరిధిలో 1000 చ.గజాల వరకూ క్రమబద్ధీకరణ దరఖాస్తుల గడువును మరో 6 నెలలు పొడిగిస్తూ అనుమతించింది.

- మిగతా3లో



## కేంద్ర విధానాలకు వ్యతిరేకంగా భారత్ బంద్

- బ్యాంకులు, స్కూల్స్, కాలేజీలు తెరిచే ఉంటాయా?
- కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న కార్మిక, కర్షక విధానాలకు వ్యతిరేకంగా భారత్ బంద్
- సమ్మెకు పిలుపునిచ్చిన కార్మిక సంఘాలు
- 30కోట్ల మంది పాల్గొనే ఛాన్స్
- కేరళ, ఒడిశా, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో భారత్ బంద్ ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం
- ఈ భారత్ బంద్ వల్ల బ్యాంకులు, పాఠశాలలు, కళాశాలలు, రవాణా సేవలు ప్రభావితం అయ్యే ఛాన్స్

వివరాలు 2లో..

## రాష్ట్ర పునర్నిర్మాణ ప్రక్రియ

# గాడిన పడింది

- అసెంబ్లీ బడ్జెట్ సమావేశంలో ఏపీ గవర్నర్ ప్రసంగం
- ఉభయ సభలను ఉద్దేశించి బడ్జెట్ సమావేశాల తొలిరోజు ప్రసంగం
- రాష్ట్ర జీఎస్‌డీపీ రూ.17.62 లక్షల కోట్లకు చేరిందని వెల్లడి
- తలసరి ఆదాయం రూ.2.95 లక్షలకు పెరిగిందని స్పష్టీకరణ
- గత ప్రభుత్వ పాలనపై 7 శ్వేతపత్రాలు విడుదల చేశామని వెల్లడి



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణ ప్రక్రియ పక్కాగా గాడిన పడిందని, ఆర్థిక పరిమితులు ఉన్నప్పటికీ జాగ్రత్తతో కూడిన ప్రాధాన్యతలు, సంస్కరణల ద్వారా రాష్ట్రం వృద్ధి పథంలోకి తిరిగి వస్తోందని గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ అన్నారు. బుధవారం నాడు బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా శాసనసభ, శాసనమండలి ఉభయ సభలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. గత 21 నెలల్లో ప్రభుత్వం మౌలిక సంస్కరణలను పూర్తి చేసిందని, అన్ని రంగాల్లోనూ స్పష్టమైన ఫలితాలు కనిపిస్తున్నాయని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన

- మిగతా3లో



## దేశం అభివృద్ధిని కాంగ్రెస్ పార్టీ ఓర్వలేకపోతోంది

- లోక్‌సభలో రాహుల్‌గాంధీ వ్యాఖ్యలపై కేంద్రమంత్రి ఫైర్
- అమెరికా ప్రభుత్వానికి భారత్ తలొగ్గింది
- ఆ పార్టీ నేతలు ఆధారాలు లేకుండా ప్రభుత్వంపై తప్పుడు విమర్శలు చేస్తున్నారన్నారు
- భారత్-అమెరికా దేశాల మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందం అమెరికాకు మాత్రమే మేలు చేసేలా ఉందనేందుకు ఆధారాలు చూపాలి

# మరో 15 ఏళ్లు మనం ఇలాగే బలంగా నిలబడాలి



- ఐక్యంగా ఉంటేనే గుజరాత్ తరహాలో అభివృద్ధి సాధ్యమని స్పష్టం
- ప్రభుత్వ విజయాలను ఎమ్మెల్యేలు ఓన్ చేసుకోవాలి.. సభకు తప్పనిసరిగా హాజరుకావాలి
- కేంద్రం సహకారంతోనే పోలవరం, అమరావతి, స్టీల్ ప్లాంట్ వంటివి గాడిన పడ్డాయి
- విభేదాలుంటే అంతర్గతంగా చర్చిద్దామని పవన్ పిలుపు
- వైసీపీ పట్ల అప్రమత్తంగా ఉండండి: మూడు పార్టీలకు పవన్ కల్యాణ్ సూచన
- చంద్రబాబు అధ్యక్షతన ఎన్డీయే శాసనసభాపక్ష సమావేశం
- వైసీపీ కుట్రల పట్ల టీడీపీ, జనసేన, బీజేపీ అప్రమత్తంగా ఉండాలని పవన్ సూచన
- హిందూమతాన్ని రాజకీయంగా ఉపయోగించుకోవాలని వైసీపీ చూస్తోందని ఆరోపణ

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి మరో 15 ఏళ్ల పాటు ఐక్యంగా, బలంగా కొనసాగాలని, అప్పుడే గుజరాత్ తరహాలో సుస్థిరమైన అభివృద్ధి సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు. ఎన్నికల సమయంలో ప్రజల ముందు ఏ స్ఫూర్తితో నిలబడ్డామో, అదే ఐక్యతను భవిష్యత్తులోనూ కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళవారం అసెంబ్లీ

- మిగతా3లో

# టీషర్ట్స్, మెడిసిన్స్ వితరణ



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి11:**
శ్రీకాళహస్తి మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శ్రీకాళహస్తి దేవస్థానంకు సుమారు 5 లక్షల రూపాయలు విలువ అయిన మెడిసిన్స్,టీ షర్ట్ లను సాగర్ సిమెంట్ యాజమాన్యం తరపున నాయుడు పేటకు చెందిన రాఘవేంద్రడీలర్స్ అధినేత రమేష్, సురేష్ అందజేశారు. ఆలయ ఈవో సమక్షంలో దాతలు టీ షర్ట్ ల మెడిసిన్ను దేవస్థానం అధికారులకు అందజేశారు. శ్రీకాళహస్తీశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారి సేవలో తరించే శ్రీపాద కూలీలకు, నిరంతర సేవకుల కోసం 300 టీషర్టు లను మహాశివరాత్రికి విచ్చేసి భక్తుల కోసం అవసరమైన వివిధ రకాల మందులను సాగర్ సిమెంట్ ఎం.డి, ఆనంద్ రెడ్డి,జే.ఎం.డి శ్రీకాంత్ రెడ్డి అధినేతల తరపున నాయుడుపేటకు చెందిన డీలర్స్ రమేష్, సురేష్‌లు అందజేశారు.ఆలయంలోని ఈవో కార్యాలయం వద్ద టీ షర్టు ,మందులను ఈవో బాపిరెడ్డి సమక్షంలో ఆలయ అధికారులకు అందజేశారు. ప్రతి ఏడాది మహాశివరాత్రి ఉత్సవాలకు శ్రీపాద కూలీలకు టీ షర్టు పంచలు భక్తులకు అవసరమైన మెడిసిన్స్ ను డీలర్స్ రమేష్ సురేష్ యాజమాన్యం నుంచి అందజేస్తున్నారు. మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలకు తమ వంతు సహాయంగా ముందుకు వస్తున్న దాతలు రమేష్ సురేష్‌లను ఆలయ ఈవో బాపిరెడ్డి అభినందించి ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వర ఆలయం డిప్యూటీ ఈవో కృష్ణారెడ్డి, జయచంద్ర నాయుడు, వెంకటేశ్వరరావు, సురేంద్రనాథ్, సుబ్రమణి, టిడిపి నాయకులు చెంచయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# బిసి వర్గాల ఆత్మీయ సోదరుడు రవన్న



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 11:**
శ్రీకాళహస్తి గత వైసిపి అరాచక ప్రభుత్వానికి వ్యతిరేకంగా అవిశ్రాంతంగా పోరాడిన సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకుడు, శ్రీకాళహస్తి పురపాలక సంఘం మాజీ వైస్ ఛైర్మన్, వన్నెకుల క్షత్రియ సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్,బిసి వర్గాల ఆత్మీయ సోదరుడు మిన్నల్ రవి అన్నకు తెలుగు తమ్ముళ్ళు హార్ధిక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. తెలుగుదేశం పార్టీకి చెందిన ప్రతీ ఒక్క కార్యకర్తను తన సొంత కుటుంబ సభ్యులుగా భావించి,అందరిలో ఒకడిగా ఉంటూ అందరి కోసం తాను అన్నట్లు నిరంతరం తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులను సమన్వయ పరచే వన్నెకుల క్షత్రియ సంక్షేమం మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి జన్మదినాన్ని పురస్కరించుకొని బుధవారం స్థానిక పూసల వీధిలో అతని చేతుల మీదుగా కేక్ కట్ చేయించి,దుశ్శాలువాతో తెలుగు తమ్ముళ్ళు ఘనంగా సత్కరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రగతి కోసం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం చేపడుతున్న అనేక అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలలోకి తీసుకెళ్ళాలని కోరారు. అలాగే ఎన్నికల ప్రచారంలో ప్రకటించినట్లుగానే సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ రెడ్డివారి గురవారెడ్డి, బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు,బీమాల భాస్కర్ ముదిరాజ్, డి.వి.నారాయణ, వజ్రం కిషోర్, చిల్లకూరు మణి, కోట చంద్రశేఖర్, హరి, ముని రెడ్డి, షేక్ మహబూబ్ బాషా, సయ్యద్ చాంద్ బాషా, గాజుల భగత్,పూల శేఖర్,షేక్ ఖాదర్, చందు, గంగనపల్లి రమేష్, కృష్ణమూర్తి, సయ్యద్ ఆదిల్, ప్రభాకర్, సులేమాన్, పోలూరు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

### వీధిలైట్లు వెలగకపోవడంతో

# ఇబ్బందులకు గురవుతున్న గ్రామస్తులు

**అధికారులకు పక్షం రోజులుగా తెలుపుతున్న పట్టించుకోని వైనం**

**చిత్తూరు ఎక్స్ ప్రెస్ లో వచ్చిన శీర్షికపై స్పందించిన అధికారులు**



**పలమనేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి11:**
చిత్తూరు జిల్లా పలమనేరు మండలం మొరం పంచాయతీ రాజీవ్ నగర్ కాలనీలో గత 15 రోజులుగా వీధి లైట్లు వెలగకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. దీనిపై సంబంధిత పంచాయతీ కార్యదర్శి (సెక్రటరీ)కి ఫిర్యాదు చేసినా, ఇప్పటివరకు ఎటు వంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో వీధులన్నీ అంధకారంగా ఉండటంతో దొంగతనాలు జరిగే అవకాశం ఉందని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. కాలనీ శివారు ప్రాంతం కావడంతో చీకటిలో పాములు, ఇతర విషకీట కాలు ఎప్పుడు ఎటువైపు నుంచి వస్తాయో తెలియక ప్రాణభయంతో గడుపుతున్నారు. సమ స్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పక్షం రోజులు గడుస్తున్నా, కనీసం మరమ్మతులు చేసేం దుకు కూడా ఎవరూ రాకపోవడం పై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. “మేము 15 రోజుల క్రితమే సెక్రటరీకి మొర పెట్టుకున్నాం. కానీ పరిస్థితిలో మార్పు లేదు. పిల్లలు, వృద్ధులు రాత్రిపూట బయటకు రావాలంటే వణికిపోతున్నారు. ఇక నేడు కూడా ఈ సమస్య తీరకపోతేజిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాల్సి ఉంటుందని తెలిపారు.

### భగవద్గీత పారాయణం అద్భుతంగా

# అర్థాలతో వివరించిన చిన్నారి ప్రవాసిని



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి11:**
శ్రీకాళహస్తి శ్రీకాళహస్తిలోని శ్రీ కాళహస్తీశ్వర స్వామి మహాశివరాత్రి బ్రహ్మోత్సవ వేడుకల్లో భాగంగా ధూర్జటి కళాప్రాంగనంలో ప్రత్యేక భగవద్గీత, శివరుద్ర పారాయణం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తికి చెందిన చిన్నారి ఏం. ప్రవాసిని భగవద్గీతలోని శ్లోకాలను పఠించి, వాటి అర్థాలను ఆంగ్లంలో అందంగా వివరించింది. ఇది ప్రేక్షకులను ప్రసన్నముగా, భక్తితో ఆకట్టుకుంది. ఆలయ అధికారుల తరపున శ్రీకాళహస్తి ట్రస్ట్ బోర్డు సభ్యుడు దండు రాఘవయ్య ఆ చిన్నారికి బహుమతి, జ్ఞాపిక, సర్టిఫికెట్ ప్రసాదాన్ని అందజేశారు.

### పలమనేర్ మాజీ ఎమ్మెల్యే వెంకయ్య గౌడ్ ఆధ్వర్యంలో

# వైసిపి విస్తృతస్థాయి సమావేశం





**పలమనేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి11:**
పలమనేరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇంచార్జ్ వెంకటే గౌడ ఆధ్వర్యంలో నిర్వహించిన వైఎస్సా ర్సీపీ సంస్థాగత నిర్మాణ సమావేశానికి ముఖ్య అతిథిగా వైఎస్ఆర్సిపి ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు భూమన కరుణాకర్ రెడ్డి, మాజీ ఎంపీ రెడ్డెప్ప చవ్వా రాజశేఖర్‌రెడ్డి వెంకటరెడ్డి యాదవ్, పలమనేరు నియోజకవర్గ అన్ని మండలాల వైయస్ఆర్సీపీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా కూటమి పాలన మరియు ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి పై సెటైర్లతో విరుచుకుపడ్డారు మాజీ ఎమ్మెల్యే వెంకటే గౌడ్... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుండి అరాచకం సృష్టిస్తున్నారు. పలమనేరు శాసన సభ్యులు అమర్నాథ్ రెడ్డి తనపై వ్యంగ్యంగా మాట్లాడారు నేను ఎమ్మెల్యే పని చేస్తున్న ఇసుక అమ్మలేదని మాట్లాడారు, మీరు అధికారం చేపట్టిన వెంటనే ఇసుక మొత్తం అమ్మేశారు కొల మాసనపల్లి క్వారీలో జల్లికా కుండా బంగారం అమ్ముతున్నారా, ఈ విధంగా మీరు మాట్లాడడం మీ స్థాయిని దిగజార్చు కున్నట్లే అన్నారు. మంత్రి స్థాయిలో ఉన్న మిమ్మల్ని ఒక సాధారణ యువకుడుగా పోటీ చేసి నేను 30 వేల పైసలకు ఓట్లు సాధించి గెలుపొందాను హిస్టరీ రిపీట్ అవుతుంది గుర్తుపెట్టుకోండి అంటూ హెచ్చరికలు జారీ చేశారు. నేను సత్య హరిశ్చంద్రుడిని చెప్పుకోవడం లేదు అమర్నాథ్ రెడ్డి కన్నా మంచి పాలిటిక్స్ చేశానన్నారు.వైసీపీ ప్రభుత్వంలో కులం మతం పార్టీ చూడకుండా అన్ని పనులు చేసాం కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి వైసీపీ కార్యకర్తలను తీవ్ర స్థాయిలో ఇబ్బందులు పెడుతున్నారు. టిడిపి వారు ఏమి ఎవరికి చెప్తే అదే జరుగుతుంది. వైసిపి హయాంలో ప్రస్తుత మార్కెట్ కమిటీ చైర్మన్ ఆలకుప్పం రాజన్న టిప్పర్లు పెట్టి కోట్లు సంపాదించుకున్నాడు ఏ రోజైనా మేము అడ్డుకున్నామా ఈరోజు సాధారణ కార్యకర్తను అడ్డుకుంటున్నారు. ఇలాంటి రాజ కీయాలు మేము ఎప్పుడూ చేయలేదని పలు విమర్శలు గుప్పించారు.

**భూమన కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ...**
వైసీపీని, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని హిందూ వ్యతిరేకిగా చిత్రీకరించేందుకు సీఎం చంద్రబాబు, కూటమి నాయకులు ప్రయత్నిస్తున్నారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సూపర్ సిక్స్ గాలికి వదిలేసి తిరుమల లడ్డు విషయంలో సుప్రీంకోర్టు చెప్పినా వైసీపీని బూచీగా చూపెట్టేందుకు దుష్ప్రచారం మాత్రం మానడం లేదన్నారు. తిరుమలలో వ్యవహారంలో తమందరిపై కక్షపూరిత మత రాజకీయాలు చేశారు వీటిని వైఎస్ఆర్సిపి పార్టీ నాయకులు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిందిగా కోరారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌పై పలు విమర్శలు గుప్పించారు.

# కూటమి పార్టీల పాలకులు డైవర్షన్ పాలిటిక్స్ పాల్పడుతున్నారు

**ఉమ్మడి చిత్తూరు జిల్లా వైసిపి అధ్యక్షులు భూమన కరుణాకర్ రెడ్డి**

**జారుడు బండ కన్నా వేగంగా చంద్రబాబు ప్రభుత్వం దిగజారుతున్నది...**

**మాజీడిప్యూటీ సీఎం నారాయణస్వామి, నియోజకవర్గ ఇన్చార్జి ఐ కృపా లక్ష్మి**



**ఎస్ఆర్ పురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి11:**
కూటమి పార్టీల పాలకులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని సాక్షాత్తు శ్రీ వెంకటేశ్వర స్వామికి శత్రువుగా చిత్రీకరించేందుకు డైవర్షన్ పాలిటిక్స్ కు పాల్పడుతున్నట్లు ఉమ్మడి చిత్తూరు జిల్లా వైసీపీ అధ్యక్షులు భూమన కరుణాకర్ రెడ్డి ఆరోపించారు. బుధవారం ఎస్ఆర్ పురం మండలంలోని 49 కొత్తపల్లిమిట్ట దీపికా కళ్యాణ మండపం లోనీ జీడీ నెల్లూరు నియోజకవర్గ వైసిపి ఇన్చార్జ్ కళాత్తూర్ కృపా లక్ష్మి, మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఆధ్వర్యంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ వార్డు కమిటీ విస్తృతసాయి సమావేశం జరిగింది.ఈ సందర్భంగా ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ...ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఆయన అనుకూల మీడియా జగన్మోహన్ రెడ్డిపై ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేస్తున్నట్టు చెప్పారు. అధికార కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబనాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై తమ పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేస్తున్న పోరాటాలను ఎదుర్కొనే దమ్ము లేక కూటమి పార్టీల పాలకులు డైవర్షన్ పాలిటిక్స్ కు పాల్పడుతున్నట్లు ఆరోపించారు.. ఇందులో భాగంగానే పవిత్రమైన తిరుమల లడ్డులో జంతువుల కొవ్వు కలిసిందని అసత్యపు ప్రచారా లకు తెరదీశారని ఆయన ధ్వజమెత్తారు. 10 రోజుల క్రితం తిరుమల లడ్డు ప్రసాదంలో ఎలాంటి జంతువుల కొవ్వు లేదని సిట్ నివేదిక ఇచ్చినప్పటికీ, చంద్రబాబునాయుడుతో సహా, ఆయన మంత్రివర్గంలోని కొంత మంది తమ అనుకూల మీడియా ద్వారా పదేపదే అసత్యపు ప్రచారం నిర్వహిస్తూ వెంకటేశ్వర స్వామికి జగన్మోహన్ రెడ్డి ప్రధాన శత్రువు అనే విధంగా చిత్రీకరిస్తున్నట్లు తెలిపారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు దీనిపై దృష్టి సారించి వాస్తవాలను ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ప్రజల వద్దకు తీసుకుపోయి ఎండగల్చాల్సిన బాధ్యత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులపై ఉందన్నారు. రోజు రోజుకి ప్రజల్లో ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత ఏర్పడుతోందని, ఈ నేపథ్యంలో ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రజలకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చేరువయ్యేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు అనంతరం నియోజకవర్గ ఇన్చార్జ్ కృపా లక్ష్మి మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం జారుడు బండ కన్నా వేగంగా దిగజారుతుందని తెలిపారు. ఒకటిన్నర సంవత్సరంలో ఇంతగా ఏ ప్రభుత్వం దివాలా తీసింది లేదు మనం ఓడిపోయిన మూడు నెలల్లో చిన్న చిరుతపులుల ఎదురి తిరిగేలా చేసాడు మన నాయకుడు జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చుకుంటే వైసిపి నాయకులు పోరాటం చేద్దామని కృపాలక్ష్మి తెలిపారు అలాగే మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి మాట్లాడుతూ ఎవరి నియోజకవర్గంలో చూసుకోవాలి గిల్లే రాజకీయాలు చేయకూడదని నారాయణస్వామి తెలియజేశారు ఈ కార్యక్రమానికి. నియోజకవర్గ అబ్జర్వర్ పృథ్వి రెడ్డి, చిత్తూరు మాజీపార్లమెంట్ సభ్యులు రెడ్డప్ప,చల్ల రాజశేఖర్, ఉమ్మడి చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షుడు గురవారెడ్డి, ఎస్ఆర్‌పురం మండల అధ్యక్షుడు మణి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు యశోదరెడ్డి, పెనుమూరు మండల అధ్యక్షుడు విజయ్ కుమార్‌రెడ్డి, డిఎస్ఆర్ రాజారెడ్డి, నవీన్ కుమార్‌రెడ్డి, మురళిరెడ్డి, పిల్లిగుండ్లపల్లి మాధవయ్య, కత్తెరంపల్లి ఎంపీటీసీ కార్తీక్ రెడ్డి, పేడకంటపల్లి కృష్ణయ్య,మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు సామ్రాజ్, కుప్పయ్య, జనార్ధన్ ఆరు మండలాల ఎంపీపీలు, మండల పార్టీ అధ్యక్షులు, సర్పంచ్‌లు, పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జాతీయ సదస్సులో సెమినార్ పుస్తకావిష్కరణ




**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి11:**
కుప్పం నియోజకవర్గంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రసాయన శాస్త్ర విభాగం మరియు బ్లాక్ బక్ ఎడ్యుకేషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో, ప్రధాన మంత్రి ఉచ్చతర్ శిక్షా అభియాన్ ఆర్థిక సహకారంతో “క్రోమాటోగ్రఫీ మరియు స్పెక్ట్రోస్కోపీని ఉపయోగించి ఔషధ సమ్మేళనాల విశ్లేషణ” అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు ఘనంగా ప్రారంభమైంది. కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.బి. ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ, డిగ్రీ విద్యార్థులకు సంప్రదాయ మరియు సాంకేతిక నైపుణ్యాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించడమే కళాశాల లక్ష్యమని తెలిపారు. క్రోమాటోగ్రఫీ పద్ధతి ద్వారా మిశ్రమాల్లోని వివిధ పదార్థాలను వేరు చేయవచ్చని, స్పెక్ట్రోస్కోపీ ద్వారా పదార్థాల రసాయన నిర్మాణాన్ని విశ్లేషించవచ్చని వివరించారు. ఔషధ పరిశ్రమలో ఈ రెండు విధానాలకు విశేష ప్రాధాన్యత ఉందని పేర్కొన్నారు. సదస్సుకు విచ్చేసిన రిసోర్స్ పర్సన్స్ డా. స్వప్న, డా. గిరీష్ తమ ప్రసంగాలలో క్రోమాటోగ్రఫీ మరియు స్పెక్ట్రోస్కోపీ ఆధారిత ఆధునిక విశ్లేషణ పద్ధతులపై విపులంగా వివరించారు. ఔషధ సమ్మేళనాల నాణ్యత నియంత్రణలో ఈ సాంకేతికతల పాత్రను ఉదాహరణలతో తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన పి.ఎం.కే చైర్మన్ డా. సురేష్ బాబు, కుప్పం మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, రాష్ట్ర వన్యకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ వేణుగోపాల్ చేతుల మీదుగా సెమినార్ సావనీర్ (పుస్తకం)ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పి.ఎం.ఉషా కోఆర్డినేటర్ వి. నారాయణ మూర్తి, వైస్ ప్రిన్సి పాల్ డా. సి. రాజ్యలక్ష్మి, డా. మాధవి, నమ్రత, డా. ఏ. చంద్రబాబు, పద్మావతి దేవి తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రం లోని వివిధ కళాశాలల నుండి వచ్చిన అధ్యాపకులు, పరిశోధ క విద్యార్థులు, కళాశాల అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పెద్దసంఖ్యలో హాజరై సదస్సును విజయవంతం చేశారు.

# 20 నెలల పాలన.. 60 విజయాలు..

-మొదటిపేజీ తరువాయి
చంద్రబాబు అన్నారు. ప్రతి ఎమ్మెల్యే, మంత్రి ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని ఆయన సూచించారు.

ఈ సందర్భంగా, 20 నెలల కాలంలో ప్రభుత్వం చేపట్టిన 60 ప్రధాన కార్యక్రమాలు, సాధించిన విజయాల జాబితాను సీఎం వివరించారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి:

1. తల్లికి వందనం: రూ.10,090 కోట్లు తల్లుల ఖాతాల్లో జమ. 67.27 లక్షల మంది విద్యార్థులకు సాయం.
2. స్త్రీ శక్తి: 43.51 కోట్లకు పైగా ఉచిత బస్సు ప్రయాణాలు. రూ.1,532 కోట్లు ఖర్చు.
3. దీపం 2 పథకం: 1.08 కోట్ల కుటుంబాలకు ఏడాదికి ఉచితంగా 3 సిలిండర్ల పంపిణీ. ఇప్పటికి 3.64 కోట్ల సిలిండర్లు అందజేత, రూ.2,891 కోట్లు వ్యయం.
4. అన్నదాత సుఖీభవ: 46.86 లక్షల మంది రైతులకు ఏడాదికి రూ.20 వేల చొప్పున సాయం. రెండు విడతల్లో రూ.6,310 కోట్లు జమ.
5. ఎన్టీఆర్ భరోసా: నెలకు 63 లక్షల మందికి పింఛన్లు. ఇప్పటికి రూ.58,654 కోట్లు వ్యయం.
6. దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, ఎక్కడైనా పింఛను తీసుకునే అవకాశం.
7. మత్స్యకార భరోసా: ఏడాదికి రూ.20 వేల చొప్పున 1.25 లక్షల మందికి రూ.250 కోట్లు.
8. నేతన్నలకు ఉచిత విద్యుత్: మరమగ్గాలకు 500, మగ్గాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్. లక్షకు పైగా కుటుంబాలకు లబ్ధి.
9. ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.15,000 సాయం. రూ.436 కోట్లు జమ, 2.90 లక్షల మందికి లబ్ధి.
10. అన్న క్యాంటీన్లు: 113 నియోజకవర్గాల్లో 205 క్యాంటిన్ల ద్వారా 7.50 కోట్ల భోజనాలు.
11. గీత కార్మికులకు 10 శాతం మద్యం షాపుల కేటాయింపు, స్వర్ణకారులకు ప్రత్యేక కార్పొరేషన్.
12. వివాదాలకు తావివ్వకుండా ఎస్సీ వర్గీకరణ, అన్ని వర్గాలకు సమన్యాయం.
13. 8,427 మంది పాస్టర్లకు నెలకు రూ.5,000 గౌరవ వేతనం.
14. ఇమామ్‌లకు నెలకు రూ.10,000, మౌజన్లకు రూ.5,000 గౌరవ వేతనం.
15. అర్చకులకు వేతనం రూ.15,000కు పెంపు. నాయీ బ్రాహ్మణులకు నెలకు రూ.25,000, జూనియర్ లాయర్లకు రూ.10,000 గౌరవ వేతనం.
16. మెగా డీఎస్సీ ద్వారా 15,941 టీచర్ పోస్టుల భర్తీకి తొలి సంతకం.
17. 5,757 కానిస్టేబుల్ పోస్టుల నియామకం పూర్తి. స్టైఫండ్ రూ.12,500కు పెంపు.
18. రాజముద్రతో కొత్త పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు.
19. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాలకు గ్రాట్యుటీ అమలు. బాలింతలకు ఎన్టీఆర్ బేబీ కిట్లు.
20. ప్రతీ నెలా 3వ శనివారం 'స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర'. చెత్తపన్ను రద్దు.
21. రూ.1,000 కోట్లతో రోడ్ల మరమ్మతులు, రూ.3,000 కోట్లతో నూతన రహదారులు.
22. కొత్తగా 25 పారిశ్రామిక పాలసీలు, 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులు.
23. విశాఖ సీఐఐ సమ్మిట్‌లో రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులు, 16.13 లక్షల ఉద్యోగాలకు ఒప్పందాలు.
24. 14 ఎస్ఐపీబీ సమావేశాల్లో రూ.8.74 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం, 8.36 లక్షల ఉద్యోగాలు.
25. విశాఖలో రూ.1.25 లక్షల కోట్లతో గూగుల్ ఏఐ డేటా సెంటర్ ఏర్పాటు.
26. అమరావతిలో క్వాంటం వ్యాలీ భవనాలకు శంకుస్థాపన. విశాఖలో టీసీఎస్ ప్రారంభం.
27. కాకినాడలో ఏఎమ్ గ్రీన్ అమోనియా ప్రాజెక్టుకు శంకుస్థాపన.
28. తిరుమల సహా ప్రధాన ఆలయాల్లో నిత్యాన్నదానాలు.
29. విశాఖలో యోగాంధ్ర, కర్నూలులో సూపర్ జీఎస్టీ సభ విజయవంతం.
30. పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీలు, పేదలకు అదనంగా 110 వైద్య విద్య సీట్లు.
31. గ్రామ సభల ద్వారా 3 వేల పనులకు శ్రీకారం, పంచాయతీలకు నిధుల విడుదల, అమరజీవి జలధార పథకం.
32. విద్యా వ్యవస్థలో మార్పులు, మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం.
33. గేట్స్ ఫౌండేషన్, టాటాలతో సంజీవని ప్రాజెక్టు, యూనివర్సల్ హెల్త్ పాలసీ ప్రతిపాదన.
34. విద్యుత్ చార్జీల పెంపు లేదని ప్రకటన, ట్రూ అప్ భారాన్ని భరిస్తున్న ప్రభుత్వం.
35. రాష్ట్ర ఆర్థికాభివృద్ధి డబుల్ డిజిట్ గ్రోత్ 11.28 శాతానికి చేరిక.
36. పేదలకు ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తుల స్వీకరణ, 3 లక్షల ఇళ్లకు గృహ ప్రవేశాలు.
37. ఉచిత ఇసుక పథకం అమలు, నాలా యాక్ట్ రద్దు.
38. 20 లక్షల ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఉచితంగా సోలార్ రూఫ్ టాప్.
39. తగ్గిన క్రైమ్ రేట్, గంజాయి-డ్రగ్స్ అరికట్టేందుకు ఈగల్ టాస్క్ ఫోర్స్.
40. మన మిత్ర ద్వారా వాట్సప్ గవర్నెన్స్‌తో 921 సేవలు.
41. విశాఖపట్నం, అమరావతి, తిరుపతి కేంద్రంగా 3 రీజియన్ల అభివృద్ధికి కార్యాచరణ.
42. పూర్వోదయ పథకంలో రాష్ట్రానికి చోటు, రాయలసీమ, ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఆస్కారం.
43. విశాఖ రైల్వేజోన్ ప్రధాన కార్యాలయం పనుల ప్రారంభం.
44. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు రూ.11,440 కోట్ల కేంద్ర సాయం.
45. 90 కేంద్ర పథకాల పునరుద్ధరణ, నిధుల సద్వినియోగం.
46. రాష్ట్రానికి రూ.1 లక్ష కోట్ల విలువైన నేషనల్ హైవే, రైల్వే ప్రాజెక్టులు.
47. కొత్తగా రెండు జిల్లాల ఏర్పాటుతో మొత్తం 28 జిల్లాలు.
48. మహిళలకు లక్ష కుట్టు మిషన్ల పంపిణీ.
49. రికార్డు స్థాయిలో ధాన్యం సేకరణ, 24 గంటల్లో రైతులకు రూ.8,120 కోట్లు జమ.
50. మార్కెట్ ఇంటర్వెన్షన్‌తో వివిధ పంటలకు రూ.1,100 కోట్లకు పైగా సాయం.
51. సమర్థ నీటి నిర్వహణతో 6.08 మీటర్లకు పెరిగిన భూగర్భ జలాలు.
52. సాగునీటి ప్రాజెక్టులకు 20 నెలల్లో రూ.23,793 కోట్ల ఖర్చు.
53. హంద్రీనీవా పనులు పూర్తి చేసి సీమకు 43 టీఎంసీల తరలింపు.
54. వెలిగొండ ప్రాజెక్టుకు రూ.571 కోట్లు వ్యయం.
55. శరవేగంగా పోలవరం నిర్మాణం, 2027 పుష్కరాలకు ప్రారంభం.
56. తుంగభద్ర గేట్ల మరమ్మతులకు ఏపీ వాటాగా రూ.55 కోట్లు.
57. రూ.610 కోట్లతో వివిధ ప్రాజెక్టుల మరమ్మతులు, రూ.878 కోట్లతో కాలువల నిర్వహణ.
58. 6,047 సాగునీటి సంఘాలకు ఎన్నికలు.
59. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రం మీదుగా 3 హై స్పీడ్ రైల్ కారిడార్లు. 60. ఆర్థిక కష్టాలు ఉన్నా ప్రభుత్వ ఉద్యోగులకు సంక్షేమ ఫలాలు.

# మరో 15 ఏళ్లు మనం ఇలాగే బలంగా నిలబడాలి

-మొదటిపేజీ తరువాయి
కమిటీ హాలులో జరిగిన ఎన్డీఏ శాసనసభా పక్ష సమావేశంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను ఉద్దేశించి ఆయన సుదీర్ఘంగా ప్రసంగించారు. గడిచిన 20 నెలల్లో కూటమి నాయకత్వంలో ఎక్కడా విభేదాలు రాకపోవడం శుభపరిణామమని, ఇదే ఐక్యతతో పనిచేసి ఎమ్మెల్యేలు ప్రజల్లో మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. ఎన్నికల నాటి కంటే ఇప్పుడు కూటమిపై ప్రజా మద్దతు మరింత పెరిగిందని చంద్రబాబు అన్నారు. "గుజరాత్‌లో బీజేపీ వరుసగా ఐదుసార్లు గెలిచి అధికారంలో ఉంది. ఒకే ప్రభుత్వం సుదీర్ఘకాలం కొనసాగడం వల్లే అక్కడ అభివృద్ధి సాధ్యమైంది. మన రాష్ట్రంలోనూ అదే జరగాలి. మరో 15 ఏళ్ల పాటు మూడు పార్టీలు ఐక్యంగా ప్రజల వద్దకు వెళ్లి ఓట్లు అడిగే పరిస్థితి రావాలి. అప్పుడే శాశ్వతంగా రాజకీయాల్లో నిలబడగలం" అని ఆయన దిశానిర్దేశం చేశారు.

**ఎమ్మెల్యేలకు స్పష్టమైన ఆదేశాలు**

ఈ సందర్భంగా శాసనసభ్యులకు ముఖ్యమంత్రి పలు కీలక సూచనలు చేశారు. "అసెంబ్లీ సమావేశాలను ప్రతి సభ్యుడు సీరియస్‌గా తీసుకోవాలి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అందరూ సభలోనే ఉండాలి. నేను కూడా సభను పూర్తిగా ఫాలో అవుతాను. సభలో సబ్జెక్టులపై అర్థవంతమైన చర్చలు జరగాలి. ఎదుటివారు తిట్టారని మనం కూడా బూతులు తిట్టకూడదు. ప్రజామోదయోగ్యంగా సభను నడుపుదాం" అని అన్నారు. త్వరలోనే జిల్లాల వారీగా ఎమ్మెల్యేలు, ఎంపీలు, కలెక్టర్లు, ఎస్పీలతో ఉమ్మడి సమావేశాలు నిర్వహించి, నియోజకవర్గాల్లో పెండింగ్ పనులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు.

**విశాఖ స్టీల్ ప్లాంట్ కోసం కేంద్రం తన పాలసీనే మార్చుకుంది**

కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారం వల్లే రాష్ట్రం వేగంగా కోలుకుంటోందని చంద్రబాబు వివరించారు. "వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రాన్ని గాడిన పెట్టామంటే దానికి కేంద్రం చేయూతే కారణం. అమరావతి, పోలవరం ప్రాజెక్టులకు కేంద్రం నిధులు ఇవ్వకపోయి ఉంటే అవి ముందుకు కదిలేవి కావు. 2027 జూన్ నాటికి పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం ఇస్తున్నామంటే అది కేంద్రం సాయంతోనే. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను నిలబెట్టేందుకు కేంద్రం తన పాలసీనే మార్చుకుంది. ఫలితంగా, మొదటిసారిగా స్టీల్ ప్లాంట్ ఒక్క నెలలో రూ.54 కోట్ల లాభాలు సాధించింది. సూపర్ సిక్స్‌తో సహా అన్ని పథకాలు అమలు చేస్తున్నామంటే దాని వెనుక కేంద్రం అండ ఉంది. ఈ ప్రభుత్వ కార్యక్రమాలను ప్రతి ఎమ్మెల్యే ఓన్ చేసుకోవాలి" అని ఆయన పిలుపునిచ్చారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కూటమి నేతలు ఎదుర్కొన్న అణచివేతను చంద్రబాబు గుర్తుచేశారు. పవన్ కల్యాణ్‌ను విశాఖలో హోటల్ గదికే పరిమితం చేయడం, తన అరెస్టు సమయంలో ఆయనకు అడుగడుగునా అడ్డంకులు సృష్టించడం వంటి ఘటనలను ప్రస్తావించారు. అలాంటి ఎన్నో సవాళ్లను ఎదుర్కొని ఐక్యంగా నిలబడి గెలిచామని, ఈ స్ఫూర్తిని ఎప్పటికీ మరువకూడదని హితవు పలికారు.

**కూటమి ధర్మానికి కట్టుబడి ఉందాం: పవన్ కల్యాణ్**

ముఖ్యమంత్రి అభిప్రాయంతో డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ పూర్తిగా ఏకీభవించారు. గత 20 నెలలుగా ఐక్యంగా పనిచేసి, వైసీపీ ఐదేళ్ల విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కించి ప్రగతి బాట పట్టిస్తున్నామని అన్నారు. "రాష్ట్రాభివృద్ధి కోసం మరో 15 ఏళ్లు కూటమి కలిసి ఉంటుంది. ఐక్యంగా ముందుకు వెళ్తుంది. ఎన్నికల్లో ఏ స్ఫూర్తితో పనిచేశామో, అదే స్ఫూర్తి భవిష్యత్తులోనూ అవసరం. పార్టీల మధ్య ఏవైనా భిన్నాభిప్రాయాలు ఉంటే, వాటిని అంతర్గతంగా కూర్చుని పరిష్కరించుకోవాలి. ప్రతి ఒక్కరూ కూటమి ధర్మానికి కట్టుబడి పనిచేయాలి" అని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

**వైసీపీ పట్ల అప్రమత్తంగా ఉండండి**

వైసీపీపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ సమావేశాలకు హాజరైన 11 మంది వైసీపీ ఎమ్మెల్యేలు గవర్నర్ ప్రసంగిస్తుండగా 11 నిమిషాల పాటు నిరసన తెలిపి వాకౌట్ చేశారు. అసెంబ్లీ వాయిదా పడిన అనంతరం కమిటీ హాలులో చంద్రబాబు అధ్యక్షతన నిర్వహించిన ఎన్డీయే శాసనసభాపక్ష సమావేశంలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, వైసీపీ కుట్రల పట్ల కూటమిలోని టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వైసీపీ హిందూమతాన్ని రాజకీయంగా ఉపయోగించుకోవాలని చూస్తోందని ఆరోపించారు. దక్షిణ భారతదేశంలో ప్రతి ఒక్కరూ హిందూమతాన్ని గౌరవిస్తారని అన్నారు. మన ప్రభుత్వంపై జగన్, ఆయన పార్టీ చేసే కుట్రలను గుర్తించాలని అన్నారు. అనంతరం, పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ, సభలో ఎంతసేపు మాట్లాడామనే దానికంటే అవసరమైన విషయం ఎంత మాట్లాడామనేది ముఖ్యమని అన్నారు. దావోస్‌లో ముఖ్యమంత్రి, తాను ప్రతి సంస్థపై ముందస్తుగా కసరత్తు చేసినట్లు చెప్పారు. అందుకే తమను కలిసిన ప్రతి సంస్థకు ముఖ్యమంత్రి క్లుప్తంగా ఏడు నిమిషాల్లోనే విషయం చెప్పి ముగించేవారని గుర్తు చేసుకున్నారు. అందుకే తక్కువ సమయంలో ఎక్కువమంది పారిశ్రామికవేత్తలను ముఖ్యమంత్రి కలవగలిగారని అన్నారు. శాసనసభలో కూడా సభ్యులు ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు.

# ఆ ప్రాంతాలు.. ఇక సూపర్

**నెల్లూరు :** రాష్ట్రంలో రవాణా వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఏపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నుంచి నెల్లూరు వరకు రైల్వే లైన్లను 4 వరుసలకు పెంచాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఈ మార్గంలో రైల్వే లైన్లు పెరగడం ద్వారా సరకు రవాణా వేగవంతంగా చేయవచ్చు అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 774 రైల్వే లెవల్ క్రాసింగ్ల వద్ద ఆర్వోబీ, ఆర్‌యూబీలను నిర్మించి, రైల్వే గేట్లు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. హైదరాబాద్- అమరావతి-చెన్నై, హైదరాబాద్-బెంగళూరు వంటి బుల్లెట్ రైలు కారిడార్లు ఏపీ మీదుగా వెళ్లడం వల్ల ఏపీకి భారీ ప్రయోజనం చేకూరుతుందని సీఎం చంద్రబాబు దీమా వ్యక్తం చేశారు. రైల్వేతో పాటు జాతీయ రహదారుల ప్రాజెక్టులకు సైతం నిధుల కొరత ఉన్న కారణంగా, అందుకు అవసరమైన భూసేకరణపై కలెక్టర్లు ఫోకస్ చేయాలని సూచించారు. గడువులోగా భూములు సేకరించేందుకు ప్రయత్నించాలని, తమకు సంబంధం లేదు అనేలా కలెక్టర్లు వ్యవహరించకూడదని మంత్రులు, కార్యదర్శుల సదస్సులో



సీఎం చంద్రబాబు సూచించారుప్రస్తుతం ఉత్పత్తుల రవాణా ఖర్చు సగటున 14 శాతంగా ఉందని, దీనిని 7 నుంచి 8 శాతానికి తగ్గించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. ఏపీలో ప్రస్తుతం 400 లక్షల టన్నుల ఉద్యాన పంటలు ఉత్పత్తి అవుతుండగా, రాబోయే ఐదేళ్లలో దీనిని 1,000 లక్షల టన్నులకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. అనంతపురం నుంచి అరటిపండ్ల రవాణా తరహాలోనే అన్ని రకాల పంటల ఎగుమతుల కోసం మెరుగైన లాజిస్టిక్స్ సదుపాయాలు కల్పించాలని పేర్కొన్నారు. అలాగే సీ ప్లేన్ల నిర్వహణలో ఏపీ దేశానికే ఆదర్శంగా నిలవబోతోందని చంద్రబాబు పేర్కొన్నారు.రాష్ట్రంలో విద్యుత్ కొనుగోలు వ్యయాన్ని భారీగా తగ్గించేందుకు కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం యూనిట్‌కు రూ. 5.18 ఉన్న వ్యయాన్ని ఎలాగైనా సరే రూ. 4 లోపు (రూ. 3.90) తీసుకురావడమే లక్ష్యమని సీఎం చంద్రబాబు తెలిపారు. విద్యుత్ ఉత్పత్తి, స్టోరేజీ, డిస్ట్రిబ్యూషన్ అన్నీ ఒకే దగ్గర ఉండేలా నూతన విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు. ట్రూడౌన్ ద్వారా వినియోగదారుడికి ప్రయోజనం దక్కేలా చూస్తామన్నారు. గతంలో నీటి కొరత, విద్యుత్ కొరత అధికంగా ఉండేది. ఇప్పుడు వాటిని అధిగమించామన్నారు. పర్యావరణ హితం కోసం ఆర్టీసీలో 1,000 విద్యుత్ బస్సులను ప్రవేశపెడుతున్నామని, పీఎం కుసుమ్, సోలార్ రూఫ్ టాప్ ప్రాజెక్టులను వేగవంతం చేయాలని కలెక్టర్లను సీఎం చంద్రబాబు ఆదేశించారు. భూగర్భ జలాలు ఒక్క మీటరు పెరగడం ద్వారా మనకు రూ.4 వేల కోట్ల వరకు ఆదా అవుతుందని తెలిపారు. ఎక్కడా లోటుపాట్లు లేకుండా, నిర్లక్ష్యం లేకుండా కలెక్టర్లు, అధికారులు పనిచేసి రాష్ట్రానికి మంచిపేరు తీసుకురావాలన్నారు.

## గ్రూప్-1లో అక్రమాలు నిగ్గు తేల్చేందుకు సిట్ ఏర్పాటు

-మొదటిపేజీ తరువాయి
మూల్యాంకనంపై సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పుపై దాఖలైన అప్పీల్ పిటీషన్లపై విచారణ జరిపిన న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

ఏపీపీఎస్సీ గ్రూప్-1 జవాబు పత్రాల మూల్యాంకనంలో అక్రమాలపై హైకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. మూల్యాంకనంలో అక్రమాలను తేల్చేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. అదనపు డీజీ స్థాయి అధికారి పర్యవేక్షణలో సిట్ బృందం ఏర్పాటు చేయాలని న్యాయస్థానం పేర్కొంది. దర్యాప్తు జరిపేటప్పుడు రాష్ట్రం వెలుపల ఉన్న ఫోరెన్సిక్ నిపుణుల సహాయం తీసుకోవాలని ఆదేశాల్లో స్పష్టం చేసింది. విజయవాడలో జరిగిన మూల్యాంకనం సమయంలో వినియోగించిన బార్ కోడ్‌లు, అసలు ఓఎంఆర్ షీట్లు, వాటి వివరాలు ఒకదానితో ఒకటి సరిపోలుతున్నాయో? లేదో అనే విషయాన్ని విశ్లేషించాలని స్పష్టం చేసింది.

ఎంపికై ఉద్యోగాలు చేస్తున్న అభ్యర్థులు దర్యాప్తును ప్రభావితం చేసే అవకాశం ఉన్నందున వారందరినీ ప్రాధాన్యం లేని పోస్టులకు బదిలీ చేయాలని సీఎస్‌ను ఆదేశించింది. ఈ వ్యవహారంలో తీసుకున్న చర్యలపై నివేదికను కోర్టుకు సమర్పించాలని సీఎస్‌కు స్పష్టం చేసింది. మార్చి 16 లోపు గ్రూప్-1 జవాబు పత్రాల మూల్యాంకనంలో అక్రమాలపై సిట్ నివేదికను కోర్టుకు సమర్పించాలని సూచించింది.

**2018లో గ్రూప్-1 నోటిఫికేషన్**

2018లో అప్పటి ప్రభుత్వం 169 గ్రూప్-1 పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వగా 2019లో పరీక్షలను నిర్వహించారు. 2021లో పరీక్షా ఫలితాలను విడుదల చేశారు. జవాబుపత్రాలను డిజిటల్ వాల్యూయేషన్ చేశారని నోటిఫికేషన్ ప్రకారం మాన్యువల్‌గా మూల్యాంకనం చేయించాలని కోరుతూ పలువురు అభ్యర్థులు 2021లో హైకోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. పిటీషన్‌పై విచారించిన న్యాయస్థానం మాన్యువల్‌గా మూల్యాంకనం చేయాలని ఆదేశాలు జారీ చేసింది. హైకోర్టు ఆదేశాలతో ఏపీపీఎస్సీ 2022లో మాన్యువల్‌గా మూల్యాంకనం జరిపిన తర్వాత ఫలితాలను విడుదల చేసింది. గ్రూప్-1 ప్రధాన పరీక్షా జవాబు పత్రాలను హ్యాయ్ ల్యాండ్‌లో ఒకసారి, వేరే ప్రాంతంలో మరోసారి మూల్యాంకనం జరిపారని దీనివల్ల తాము అనర్హులు అయ్యామని పలువురు అభ్యర్థులు 2022లో హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేశారు.

**2024 మార్చి 13న కీలక తీర్పు**

ఈ వ్యాజ్యాలపై హైకోర్టు సింగిల్ జడ్జి విచారణ జరిపింది. ఈ దశలో ఇంటర్వ్యూలను నిలువరించలేమన్న న్యాయస్థానం ఇంటర్వ్యూ నిర్వహించేందుకు అనుమతినిచ్చింది. ఇంటర్వ్యూలో సెలక్ట్ అయిన వారిని ఉద్యోగాల్లో నియమించాలని కోర్టు సూచించింది. నియామకాలు జరిపే సమయంలో అభ్యర్థులు కోర్టు తుది తీర్పుకు లోబడే ఉండాలంటూ అండర్ టేకింగ్ లెటర్ తీసుకోవాలని ఏపీపీఎస్సీని ఆదేశించింది. గ్రూప్-1 ప్రధాన పరీక్ష జవాబుపత్రాల మాన్యువల్ మూల్యాకనంలో అక్రమాలు చోటు చేసుకున్నాయన్న కారణంతో పరీక్షను రద్దు చేసి, తాజాగా నిర్వహించాలని హైకోర్టు సింగిల్ జడ్జి 2024 మార్చి 13న కీలక తీర్పు ఇచ్చారు. ఈ తీర్పును సవాలు చేస్తూ ఏపీపీఎస్సీ, ఉద్యోగాలు పొందిన వారు, పొందని వారు ధర్మాసనం ముందు వేర్వేరుగా అప్పీళ్లు వేశారు. 'అప్పీళ్లలో' ఉద్యోగాలకు ఎంపికన అభ్యర్థులు కొందరు దాఖలు చేసిన 'అనుబంధ పిటిషన్లపై' హైకోర్టులో వాదనలు ముగిశాయి. మాన్యువల్ మూల్యాంకనంలో జరిగిన అక్రమాలను వెలికితీసేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేయాలని హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది.

## ఏపీ ఏఐ లివింగ్ ల్యాబ్స్‌కి ఆమోదం

-మొదటిపేజీ తరువాయి
రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ భూములలో నివాసాలు ఏర్పరుచుకున్న అనధికార ఆక్రమణల క్రమబద్ధీకరణ దరఖాస్తుల గడువును 30-06-2026 వరకూ అనుమతికి క్యాబినెట్ ఆమోదించింది. కృష్ణా జిల్లా గన్నవరం మండలం కీసరపల్లి గ్రామంలోని సర్వే నెం.29/8లోని 3.84 ఎకరాల భూమిని "కస్టమ్స్ (ప్రివెంటివ్) కమిషనరేట్ కార్యాలయం, నివాస గృహాల నిర్మాణం" కోసం ఉపయోగించేందుకు అనుగుణంగా గతంలో ఇచ్చిన జీవోలో మార్పు చేస్తూ కేబినేట్ నిర్ణయం తీసుకుంది. ఏలూరు జిల్లా అగిరిపల్లి మండలం తోటపల్లి గ్రామంలో 45.60 ఎకరాల ప్రభుత్వ భూమిని ఎన్ఆర్ఈడీసీఏపీ(చీ=జుణజూ్రా)కి కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ స్థాపన కోసం కేటాయించే ప్రతిపాదనకు ఆమోదించనుంది. నంద్యాల జిల్లా సంజామల మండలం నోస్సం గ్రామంలో 1500 ఎకరాలు భూమిని 250 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్ట్ కోసం ఎన్ఆర్ఈడీసీఏపీకి కేటాయించేందుకు క్యాబినెట్ ఆమోదించనుంది.

విశాఖపట్నం ఆనందపురం మండలం గుడిలోవ గ్రామంలో 18.57 ఎకరాలు ప్రభుత్వ భూమి కేటాయింపుపై మంత్రివర్గం ఆమోదం తెలిపే అవకాశముంది. ఆంధ్రప్రదేశ్ ఏఐ లివింగ్ ల్యాబ్స్ ప్రారంభానికి, తిరుపతిలో ఏపీఎస్‌డీసీ కోసం డిజాస్టర్ రికవరీ సెంటర్ ఏర్పాటుకు మంత్రి మండలి ఆమోదం తెలపనుంది. డీఎస్‌డబ్ల్యూఎస్ (సవరణ) బిల్లు 2026ను శాసనసభలో ప్రవేశపెట్టేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చే అవకాశం ఉంది. అమరావతి మెరినా అభివృద్ధికి (పీపీపీ మోడల్) 33 సంవత్సరాల లీజు ప్రాతిపదికన, టెండర్లకు ఆహ్వానించింది. పీఎంఏవై గ్రామీణ్ 2.0లో యూనిట్ ఖర్చు రూ.2 లక్షల 39 వేలుగా నిర్ణయించి క్యాబినెట్ అంగీకారం తెలపనుంది. రామాయపట్నం పోర్ట్ అభివృద్ధి కార్పొరేషన్ రుణ పునర్వినియోగం, రాష్ట్ర హామీ, కంఫర్ట్ లెటర్ జారీ తదితర అంశాలపై మంత్రివర్గం చర్చించింది. ఎన్నికల ఓటర్ల జాబితా ప్రచురణకు ఏడాదికి 4 అర్హత తేదీలను కల్పించేందుకు సవరణ బిల్లుకు కేబినేట్ ఆమోదించింది. యాగంటి పీఎస్పీ (1000 ఎండబ్ల్యూ), రాజుపాలెం పీఎస్పీ (800 ఎండబ్ల్యూ) ప్రాజెక్టులను ఏపీ జెన్కో స్వతంత్రంగా అమలు చేయడానికి ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. ఏపి ట్రాన్స్‌కోలో కడప జోన్ పరిపాలన కోసం అసిస్టెంట్ సెక్రటరీ పోస్టు సృష్టి ప్రతిపాదనకు ఆమోదం తెలపనుంది. సుజ్లాన్ & యాక్సిస్ సంస్థల అభ్యర్థన మేరకు పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టుల అమలు గడువును మరో 2 సంవత్సరాలు పొడిగిస్తూ మంత్రివర్గం నిర్ణయించింది.

## రాష్ట్ర పునర్నిర్మాణ ప్రక్రియ గాడిన పడింది

-మొదటిపేజీ తరువాయి
ద్వారా రాష్ట్రాన్ని పునర్నిర్మించే బాధ్యతను ప్రజలు తమ ప్రభుత్వానికి అప్పగించారని గవర్నర్ గుర్తుచేశారు. "గత కొన్నేళ్ల ఆర్థిక ఒత్తిడి తీవ్ర అసమతుల్యతలను సృష్టించింది. అనేక రంగాల్లో గణనీయమైన అప్పులు పేరుకుపోయాయి. అయినా, ఆర్థిక వ్యవస్థను స్థిరీకరించడానికి, రుణ వ్యయాలను తగ్గించడానికి, విశ్వసనీయతను తిరిగి సంపాదించడానికి ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకుంది. స్వర్ణాంధ్ర దార్శనికతతో ముందుకు సాగుతున్నాం" అని ఆయన వివరించారు. ప్రభుత్వ ప్రయత్నాల ఫలితంగా రాష్ట్ర ఆర్థిక పనితీరు మెరుగుపడిందని గవర్నర్ తెలిపారు. "2025-26 మొదటి ముందస్తు అంచనాల ప్రకారం, ఆంధ్రప్రదేశ్ స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి (+ూణూ) గత ఏడాది రూ.15.91 లక్షల కోట్ల నుంచి రూ.17.62 లక్షల కోట్లకు పెరిగింది. ఇది 10.75 శాతం నామమాత్రపు వృద్ధి రేటును సూచిస్తోంది. రాష్ట్ర తలసరి ఆదాయం గతేడాది రూ.2.66 లక్షల నుంచి రూ.2.95 లక్షలకు పెరిగింది. వ్యవసాయ రంగంలో 7.83 శాతం, పరిశ్రమల రంగంలో 9.53 శాతం, సేవల రంగంలో 12.94 శాతం వృద్ధి సాధించాం" అని ఆయన గణాంకాలతో సహా వివరించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన దుష్పరిపాలనపై ప్రజలకు వాస్తవాలు తెలియజేసేందుకు ఏడు శ్వేతపత్రాలను విడుదల చేసినట్లు గవర్నర్ తన ప్రసంగంలో పేర్కొన్నారు. ప్రజాధనం దుర్వినియోగం, పోలవరం ప్రాజెక్టును పట్టాలు తప్పించడం, విద్యుత్ రంగం విధ్వంసం, సహజ వనరుల దుర్వినియోగం, అవినీతిమయమైన ఎక్సైజ్ విధానాలు, శాంతిభద్రతల క్షీణతతో పాటు భవిష్యత్ రాజధాని అమరావతిని నాశనం చేసే లక్ష్యంతో చేసిన మూడు రాజధానుల ప్రతిపాదన వంటి అంశాలను ఈ శ్వేతపత్రాల ద్వారా ప్రజల ముందు ఉంచామన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే 'సూపర్ సిక్స్' హామీలను నెరవేర్చడంపై దృష్టి సారించామని, క్రమంగా పాలనను పునరుజ్జీవనం నుంచి ఉన్నత స్థాయికి తీసుకెళ్లామని గవర్నర్ తెలిపారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ అనే జాతీయ ఆకాంక్షలకు అనుగుణంగా, రాష్ట్రాన్ని 'సంపన్న, ఆరోగ్యకరమైన, సంతోషకరమైన'దిగా తీర్చిదిద్దడమే లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ పరివర్తన యజ్ఞంలో ప్రతి పౌరుడూ భాగస్వామి కావాలని ఆయన పిలుపునిచ్చారు. మన బలంపై విశ్వాసంతో, ఐక్య లక్ష్యంతో ఏపీ ముందుకు సాగుతోందని, ప్రతి పౌరుడూ గౌరవంగా, అవకాశాలతో జీవించే భవిష్యత్తుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని గవర్నర్ తన ప్రసంగాన్ని ముగించారు.

చిత్తూరు ఎక్స్‌ప్రెస్
APTEL/2024/86143 జాతీయ తెలుగు దినపత్రిక



## కుప్పం ఆర్డీఓ కార్యాలయంలో
# జాయింట్ కలెక్టర్ సమీక్షా సమావేశం

**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి11:**
చిత్తూరు జిల్లా జాయింట్ కలెక్టర్ కుప్పం రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ కార్యాలయాన్ని సందర్శించి, డివిజన్ పరిధిలోని వివిధ రెవెన్యూ అంశాలపై సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కుప్పం రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్, డి.ఐ.ఓ.ఎస్., డివిజన్‌లోని అన్ని మండలాల తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, మండల సర్వేయర్లు పాల్గొన్నారు. రెవెన్యూ శాఖకు సంబంధించిన ప్రస్తుత పరిస్థితులు, రీ-సర్వే ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలు, ప్రజల నుండి అందుతున్న ఫిర్యాదులు మరియు వాటి పరిష్కారంపై విస్తృతంగా చర్చించారు. ప్రజలకు సంబంధించిన రెవెన్యూ సేవలను సకాలంలో, పారదర్శకంగా అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు. ముఖ్యంగా రీ-సర్వేకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని, భూసంబంధిత రికార్డులలో ఖచ్చితత్వం, పారదర్శకత ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని, ప్రతి ఫిర్యాదును సమగ్రంగా పరిశీలించి నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ కేసుల పురోగతిని సమీక్షించి, ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటిస్తూ వేగవంతంగా పరిష్కరించాల్సిందిగా సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. రెవెన్యూ పరిపాలనలో సమన్వయం, బాధ్యతాయుత వ్యవహారం, ప్రజానుకూల దృక్పథం అవసరమని పేర్కొంటూ, అధికారుల పనితీరును సమీక్షించిన జాయింట్ కలెక్టర్, ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు. సమావేశం అనంతరం కార్యాలయ రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేసినట్లు సమాచారం.

## ద్రావిడ విశ్వవిద్యాలయంలో
# ఎన్ సి సి ఆధ్వర్యంలో క్యాంప్ ఫైర్ ప్రోగ్రాం



**గుడిపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి11:**
కుప్పం నియోజకవర్గం గుడిపల్లి మండలంలోని ద్రావిడ విశ్వవిద్యాలయం ఎన్ సి సి విభాగం ఆధ్వర్యంలో క్యాంప్ ఫైర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విశ్వ విద్యాలయ ఉపకులపతి ఆచార్య ఏం దొరస్వామి, రిజిస్టర్ ఆచార్య వీ కిరణ్ కుమార్, డీన్ ఎకడమిక్ అఫైర్స్ ఆచార్య కే. శ్యామల, డాక్టర్. పలని పాల్గొన్నారు. ఎన్ సి సి ఆధ్వర్యంలో క్యామ్ ఫైర్ కార్యక్రమమును నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల మధ్య సంబంధాలు మెరుగుపడతాయని కార్యనిర్వాహకులు ఎన్‌సిసి అధికారి ప్రసాద్ నాయక్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ సి సి విద్యార్థులు, పరిశోధకలు విద్యార్థులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి11:**
కుప్పం మండలం చెక్కునత్తం పంచాయతీ పరిధిలోని చెక్కునత్తం గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న లక్ష్మమ్మ, రాజప్పలకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన చెక్కులను రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ చెక్కునత్తం మణి స్థానిక టిడిపి నాయకులతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా చెక్కునత్తం మణి మాట్లాడుతూ, పేద ప్రజలకు అత్యవసర వైద్య సహాయం అందించేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. అవసరమైన వారికి ప్రభుత్వం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. ప్రజలు ఇలాంటి పథకాల గురించి అవగాహన కలిగి అవసరమైనప్పుడు వినియోగించుకోవాలని సూచించారు. క్లస్టర్ ఇంచార్జి శ్రీనివాసులు, మండలం యువత అధ్యక్షులు కనకరాజు, యూనిట్ ఇంచార్జి శివకుమార్, పార్టీ అధ్యక్షులు బీరప్ప మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు చేరేలా పార్టీ శ్రద్ధగా పనిచేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బూత్ ఇంచార్జిలు వినోద్, రాము, వెంకటా చలం, తిమ్మప్ప, ధనప్ప, సుబ్రమణి, మాదేశ్, పళని, రామస్వామి తదితరులు పాల్గొన్నారు. గ్రామస్థులు ప్రభుత్వం అందించిన సహాయానికి కృతజ్ఞతలు తెలిపారు.

# పండిట్ దీనదయాళ్ వర్ధంతి సందర్భంగా నివాళులు




**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 11:**
భారతీయ జనతా పార్టీ సిద్ధాంతకర్త, మహానేత పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి సందర్భంగా కుప్పంలోని బీజేపీ కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి పుష్పమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కుప్పం బీజేపీ ఇంచార్జ్ తులసీనాథ్ మాట్లాడుతూ, పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ దేశానికి అందించిన అంత్యోదయ మరియు ఏకాత్మ మానవవాదం సిద్ధాంతాలు దేశ రాజకీయాలకు మార్గదర్శకంగా నిలిచాయని పేర్కొన్నారు. సమాజంలోని చివరి వ్యక్తి అభివృద్ధే నిజమైన అభివృద్ధి అన్న ఆయన భావజాలాన్ని ప్రతి కార్యకర్త ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు ఇంద్రకుమార్, పలని అంజికుమార్, జగదీష్, వెంకటేష్ తదితరులు మాట్లాడుతూ, దీనదయాళ్ ఉపాధ్యాయ జీవితం యువతకు ఆదర్శమని కొనియాడారు. ఆయన త్యాగం, క్రమశిక్షణ, జాతీయతా భావం దేశ రాజకీయ చరిత్రలో చిరస్మరణీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని, పార్టీసిద్ధాంతాలనుప్రజల్లోకి తీసుకెళ్లాలని సంకల్పించారు.

# పచ్చికాపల్లిలో చెల్లం పాలెం సోసిలయ్య శుభస్వీకరణ




**వెదురుకుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 11:**
వెదురుకుప్పం మండలం, పచ్చికాపల్లం (కార్వేటినగరంరోడ్), స్వర్గీయ చెల్లంపాలెం సోసిలయ్య (పంచాయతీరాజ్ రిటైర్డ్ ఉద్యోగి) శుభస్వీకరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఉపముఖ్యమంత్రి కె. నారాయణస్వామి ప్రధాన అతిథిగా పాల్గొని, సి. సోసిలయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జెడ్పీటీసీ చల్లంపాలెం సుకుమార్, నాయకులు బోడిరెడ్డి నరేష్ రెడ్డి, కోలార్ ప్రకాష్ తదితరులు కూడా పాల్గొన్నారు. కార్యక్రమంలో స్వర్గీయ సోసిలయ్య సేవలను గుర్తుచేసుకుని, పంచాయతీరాజ్ వ్యవస్థలో ఆయన చేసిన కృషిని అందరూ ప్రశంసించారు. కె.నారాయణస్వామి ప్రసంగిస్తూ ఆయన ఆదర్శాలను అనుసరించాలని, స్థానిక అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.చల్లం పాలెం సుకుమార్ మాట్లాడుతూ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. బోడి రెడ్డి నరేష్ రెడ్డి, కోలార్ ప్రకాష్ తదితరులు కార్యక్రమ విజయాన్ని ప్రత్యేకంగా ప్రశంసించారు. స్థానికులు, రాజకీయ, సామాజిక కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# వైస్సార్ కాంగ్రెస్ విస్తృత సమావేశం



**వెదురుకుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి11:**
దీపికా కళ్యాణమండపంలో జీడి నెల్లూరు ఇంచార్జ్ కృపాలక్ష్మీ ఆధ్వర్యంలో వైస్సార్ కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ, వార్డు కమిటీల విస్తృత సాయి సమావేశం విజయవంతంగా జరిగింది. ఈ సమావేశంలో ప్రధాన అతిథులుగా జీ.డి. నెల్లూరు యువత విభాగం అధ్యక్షుడు కామసాని కిషోర్, వైద్య విభాగం అధ్యక్షులు కోలార్ ప్రకాష్, జిల్లా యువత విభాగం కార్యదర్శి కె. ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు. పార్టీ స్థానిక సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలు, రాబోయే రాజకీయ వ్యూహాలపై విస్తృత చర్చించారు.సమావేశంలో గ్రామ, వార్డు కమిటీ సభ్యులు, కార్యకర్తలు మొత్తం 200 మంది ముఖ్యంగా పాల్గొని పార్టీ పట్ల నమ్మకాన్ని, కట్టుబాటును తెలియజేశారు. కృపా లక్ష్మీ ప్రసంగిస్తూ పార్టీ అధ్యక్షుడు వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో జనవృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని, స్థానికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కామసాని కిషోర్ మాట్లాడుతూ యువత శక్తిని పార్టీ అభివృద్ధికి ఉపయోగించుకోవాలని, కోలార్ ప్రకాష్ వైద్య సేవల్లో పార్టీ సామాజిక బాధ్యతలను నెరవేర్చాలని సూచించారు. కె. ధనరాజ్ సమావేశ విజయాన్ని ప్రత్యేకంగా ప్రశంసించారు.

# వైభవంగా వీకోటలో
# అంజని పుత్రుని పుష్ప పల్లకి సేవ
## ఆలయం వద్ద బారులు.. తీరిన భక్తులు.



**వీ.కోట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 11:**
వీ.కోట పట్టణంలో వెలసియుండు శ్రీవీరాంజ నేయ స్వామి 59వ పుష్పపల్లకి సేవ ఉత్సవానికి వీకోట పట్టణంలో విశేషమైన విద్యుత్ దీపాలం కరణతో తిరుమల అని తలపించే విధంగా తీర్చి దిద్దినారు. వి.కోట పట్టణం భక్తులతో మరియు సందర్శకులతో పోటెత్తినది. వీకోట బజారు మార్గం మరియు పరస నిర్వహించే వేణుగోపాల స్వామి గుడి వీధులలో దుకాణాలతో మరియు సందర్శకులతో కిటకిటలాడుతున్నది. ఆలయం కు విచ్చేసే భక్తుల కోసం అన్న ప్రసాదాలను అత్యధికంగా సిద్ధం చేసినారు. వీరాంజనేయ స్వామి వీకోట పట్టణ పురవీధులలో ఊరేగించడానికి కనులవిందైన భారీ పూల పల్లకిని సిద్ధం చేసినారు. స్వామి వారిని ఊరేగింపు సందర్భంగా వైద్య బృందం డప్పుల బృందం కోలాటాలు పండరి భజనలు రామ భజనలు బుట్ట బొమ్మలు సిద్ధం చేసినారు. పుష్ప పల్లకి సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వీకోట పట్టణ సిఐ సోమశేఖర్‌రెడ్డి తమ పరివారంతో గట్టి బందోబస్తు ఏర్పాట్లు నిర్వహిస్తు న్నారు. ఆలయం వద్ద భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ ధర్మకర్త మరియు ఆలయ నిర్వహణ కమిటీ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నది.

## వీకోట వీరాంజనేయ స్వామికి
# పట్టువ సమర్పించిన ఎమ్మెల్యే సతీమణి..



**వీకోట,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఫిబ్రవరి 11:**
వి.కోటాలో అందరంగా వైభవంగా జరుగుతున్న శ్రీవీరాంజనేయస్వామి 59వ వార్షిక పుష్ప పల్లకి సేవ సందర్భంగా పలమనేరు శాసనసభ్యులు ఆంధ్రప్రదేశ్ మాజీమంత్రి ఎన్. అమర్నాథ్ రెడ్డి సతీమణి శ్రీమతి రేణుక అమరనాథరెడ్డి బుధవారం రోజు వీకోటకు విచ్చేసి వీరాంజనేయ స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించినారు. కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని ఎమ్మెల్యే సతీ మణి రేణుక రెడ్డి కూడా వీకోట బ్రాహ్మణ వీధి నుండి పట్టు వస్త్రాలతో మేళ తాళాల సన్నాయి వాయిద్యాలతో బయలుదేరి బజారు మార్గాన వెళ్లి స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించినా రు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త జిఎంఎస్ సుబ్బన్న, పాలక మండలి మరియు ఆలయ అర్చకులు శ్రీమతి రేణుకా రెడ్డిను పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామివారి దర్శన ఏర్పాట్లు కల్పించి తీర్థప్రసాదాలు పంపిణీ చేసినారు. రేణుకారెడ్డి వెంట చిత్తూరు పార్లమెంట్ ఉపాధ్యక్షు డు శ్రీ రామచంద్ర నాయుడు (రామన్న), వీకోట మాజీ ఎంపీపీ సులోచన రంగనాథ్, ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ డైరెక్టర్ ఏ ఎమ్ రంగనాథ్, మండల పార్టీ అధ్యక్షుడు రాంబాబు, ఈశ్వర్, దిరాజ్ ,శబరి, మరియు మీ కోట మండల కూటమి ప్రభుత్వ నాయకులు కార్యకర్తలు స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ప్రశాంత వాతావరణంలో
# శివరాత్రి పండుగ జరుపుకోవాలి.



**పీలేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి11:**
అన్నమయ్యజిల్లా పీలేరు ప్రశాంత వాతావరణంలో శివరాత్రి వేడుకలు జరుపుకో వాలని తహశీల్దార్ శివకుమార్. కార్యాల యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు తహశీల్దారు, 15వ తేదీన మహా శివరాత్రి సందర్భంగా మండలంలోని శివాలయాలకు సంబంధించిన ధర్మకర్తలు, ఉత్సవ కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు, పంచాయతీ అధికారులు, విద్యుత్ శాఖ, వైద్య శాఖ మరియు పోలీస్ శాఖ అధికారులతో తహశీల్దార్ శివ కుమార్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మహాశివరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా, సజావుగా నిర్వహించబడేలా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని తెలియజేశారు.ద

# పెనుమూరులో రెవెన్యూ సమస్యలపై ఆర్డీఓ ఆగ్రహం
## పెండింగ్ కేసులపై రైతులతో చర్చలు

**పెనుమూరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 11:**
మండలంలో రెవెన్యూ సమస్యలు విపరీతంగా పెరుగుతున్నాయని ఆర్డీఓ శ్రీనివాసులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వీఆర్‌ఓలు, సర్వేయర్లు తమ విధులను సక్రమంగా నిర్వహిస్తున్నారా లేదా అని అధికారులను ప్రశ్నించారు. మీరు విధులు సరిగా నిర్వర్తిస్తే ప్రతి సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే పీజీఆర్‌ఎస్‌కు ఎందుకు అధికంగా ఫిర్యాదులు వస్తున్నాయని మండిపడ్డారు. దారి సమస్యలను వెంట నే పరిష్కరించలేరా అంటూ సిబ్బందిని హెచ్చరించారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న సమస్యలపై 15 మంది రైతులతో ఆర్డీఓ చర్చలు జరిపారు. రైతుల సమస్యలను ఒక్కొక్కటిగా పరిశీలించి, వీలైనంత త్వరగా పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు పేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని ఆర్డీఓను కోరారు. సమావేశంలో తహసీల్దార్ శ్రావణ్ కుమార్‌తో పాటు సంబంధిత రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# బిజినెస్

## వాహనాల రిటైల్ అమ్మకాలకు జీఎస్టీ బూస్ట్



దేశీయ వాహన పరిశ్రమలో కంపెనీలు సరికొత్త రికార్డు అమ్మకాలను సాధించాయి. ఈ ఏడాది జనవరిలో దేశీయ ఆటో పరిశ్రమ రిటైల్ అమ్మకాలు దాదాపు 18 శాతం పెరిగి 27 లక్షల యూనిట్లకు చేరాయని డీలర్ల సంఘం ఫాడా మంగళవారం ప్రకటనలో వెల్లడించింది. గతేడాది పండుగ సీజన్‌కు ముందు కేంద్రం ప్రకటించిన జీఎస్టీ సంస్కరణలకు దోహదపడ్డాయి. గత నెలలో పంటకోత, వివాహ వేడుకల సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో గిరాకీ సానుకూలంగా ఉండటం వంటి అంశాలు కూడా అమ్మకాలు పెరిగేందుకు ప్రధాన కారణాలు. ఫాడా డేటా ప్రకారం, జనవరిలో మొత్తం రిటైల్ అమ్మకాలు 27,22,558 యూనిట్లకు చేరాయి. గతేడాది ఇదే నెలలో 23,14,940 యూనిట్లతో పోలిస్తే ఇది 17.61 శాతం పెరిగింది. ఇందులో ప్యాసింజర్ వాహనాల రిటైల్ అమ్మకాలు 7 శాతం పెరిగి 5,13,475 యూనిట్లుగా నమోదయ్యాయి. మెట్రో ప్రాంతాల్లో కంటే గ్రామీణ ప్రాంతాల్లో అమ్మకాలు 14.43 శాతం పెరిగాయి. పట్టణ ప్రాంతాల్లో మాత్రం 2.75 శాతం వృద్ధి నమోదైంది. ముఖ్యంగా ఎస్‌యూవీ, కాంపాక్ట్ ఎస్‌యూవీ, ఎంట్రీ-లెవల్ కార్లకు తిరిగి డిమాండ్ కనిపిస్తోందని ఫాడా అధ్యక్షుడు సీ ఎస్ విఘ్నేశ్వర్ పేర్కొన్నారు. ద్విచక్ర వాహన విభాగంలో 18,52,870 యూనిట్లు, త్రీ-వీలర్ విభాగంలో 19 శాతం, కమర్షియల్ విభాగంలో 15 శాతం అమ్మకాలు పెరిగాయి. ట్రాక్టర్ అమ్మకాలు అధికంగా 23 శాతం పెరిగాయని ఫాడా వెల్లడించింది.

## గోల్డ్ ఈటీఎఫ్‌లలో భారీ పెట్టుబడులు




దేశీయ గోల్డ్ ఈటీఎఫ్‌లలో భారీ పెట్టుబడులు పోగవుతున్నాయి. గత కొన్ని నెలలుగా రికార్డు స్థాయిలో ధరలు పెరుగుతుండటంతో గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్‌లోకి నిధులు వరదలా వచ్చి చేరుతున్నాయి.

జూ7

మ్యూచువల్ ఫండ్స్ అసోసియేషన్ యాంఫీ విడుదల చేసిన డేటా ప్రకారం, ఈ ఏడాది జనవరి నెలకు సంబంధించి గోల్డ్ ఈటీఎఫ్ విభాగంలో ఏకంగా రూ. 24,039.96 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఇది గతేడాది జనవరిలో వచ్చిన రూ. 11,647 కోట్ల కంటే రెట్టింపు కావడం విశేషం.అంతేకాకుండా ఇదే నెలలో ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలోకి వచ్చిన రూ. 24,028 కోట్ల కంటే కూడా కూడా ఎక్కువ గోల్డ్ ఈటీఎఫ్‌లలోకి నిధులు రాడం విశేషం. ఇక, ఈక్విటీ మ్యూచువల్ ఫండ్ పెట్టుబడులకు సంబంధించి జనవరి నెలలో నిధులు 14 శాతం తగ్గి రూ. 24,028 కోట్లు వచ్చాయి. ఇవి వరుసగా రెండో నెలా తగ్గుముఖం పట్టాయి. గ్లోబల్ మార్కెట్లలో నెలకొన్న స్తబ్దత, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల కారణంగా ఇన్వెస్టర్లు ఈక్విటీల్లో మదుపు చేసేందుకు జాగ్రత్త పడ్డారు. ఇదే సమయంలో బంగారం ధరలు పుంజుకోవడం వల్లనే గోల్డ్ ఈటీఎఫ్‌లో ఇన్వెస్ట్ చేసేందుకు మొగ్గు చూపారు. దీంతో మ్యూచువల్ ఫండ్ సంస్థల(ఏఎంసీ) నిర్వహణలో ఉన్న మొత్తం ఆస్తుల విలువ రూ. 81.01 లక్షల కోట్లకు చేరింది.

Edited Printed Published & Owned by Dama VijayAKumar. And Printed at Vijay Publishers and Printers, #1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. Published at Vijay Publications, 1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. EDITOR DAMA VIJAYAKUMAR, RNI. NO. APTEL/2023/86143